

పునరావాస కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక ఆల్కాట్ గార్డెన్స్‌లోని మున్సిపల్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న లంక గ్రామాల ప్రజలతో మాట్లాడారు. వరద ఉధృతి తగ్గే వరకు శిబిరంలో ఉండాలని, అధికారులకు సహకరించాలని వారిని కోరారు. పునరావాస కేంద్రంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. శానిటేషన్ విషయంలో అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారికి వేడి నీళ్లు అందించాలని సిబ్బందికి సూచించారు. అక్కడే ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో అందుబాటులో ఉంచిన మందుల వివరాలు, చికిత్స తదితర వివరాలు తెలుసుకున్నారు. దోమల నివారణకు సంబంధించి చర్యలు తీసుకోవాలని, నిర్వాసితులకు వేడి ఆహారం అందించాలని సూచించారు.

నెమ్మదించిన గోదావరి

- కొనసాగుతున్న 2వ ప్రమాద హెచ్చరిక
- భద్రాచలం వద్ద తగ్గుతున్న ప్రవాహం
- లంకల్లోకి ప్రవేశించిన వరదనీరు

ప్రజాశక్తి - యంత్రాంగం

రెండు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి మంగళవారం రాత్రికి నెమ్మదించింది. భద్రాచలం వద్ద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. రెండు చోట్ల 2వ ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రికి భద్రాచలం వద్ద 50.10 అడుగుల నీటి మట్టం ఉంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 14.80 అడుగులకు నీటి మట్టం చేరింది. బ్యారేజీ చెందిన 175 గేట్లను పైకెత్తి 14,36,472 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించింది. భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టినప్పటికీ ధవళేశ్వరం వద్ద క్రమంగా పెరిగే అవకాశం ఉండటంతో లంక గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ప్రవాహం

లంకల్లోకి చేరిన వరదనీరు

కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు 14 లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీటిని విడుదల చేయడంతో నదీ తీరంలోని లంకల్లోకి వరదనీరు చేరింది. కపిలేశ్వరపురం, పి.గన్నవరం, కొత్తపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం, మామిడికుదురు, ఐ.పోలవరం, కొత్తూరు, సీతానగరం మండలాల్లో లంకలు వరదబారిన పడ్డాయి. పలు కాజ్‌వేలు నీటమునిగాయి. ఆలమూరు మండలంలో బడుగువాని లంక, తోకలంక, అయినవిల్లి మండలంలో పల్లపులంక, అయినవిల్లిలంక, శానపల్లిలంక, పొట్టిలంక, పి.గన్నవరంలో గంటిపెదపూడి లంకల్లో లోతట్టు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. పిగన్నవరంలో అక్విడెక్టు ఆనుకుని వరద ప్రవహిస్తోంది. రామచంద్రపురం మండలం కోటిపల్లి రేవు పూర్తిగా నీటమునిగింది. ఇక్కడ పడవలు, పంటులపై ప్రయాణాలను అధికారులు పూర్తిగా నిషేధించారు. దీంతో కోటిపల్లిలంకకు రాకపోకలు స్తంభించాయి. కపిలేశ్వరపురం మండలంలోని నారాయణలంక, కేదార్లంక, తాతపూడి, కోరుమిల్లి, అద్దంకివారి లంకల్లోకి వరదనీరు ప్రవేశించింది. తూర్పు గోదావరి జిల్లాలో బ్రిడ్జి లంక, ఎదుర్లమ్మ లంక, కేతావారి లంక గ్రామాల్లో 248 మంది నిర్వాసితులను పునరావాస కేంద్రానికి తరలించారు. వారిని రాజమహేంద్రవరం నగరంలో చందా సత్రం, ఆల్కాట్ గార్డెన్స్ మున్సిపల్ కళ్యాణ మండపంలో పునరావాసం కల్పించారు. అత్యవసర మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

నీట మునిగిన కూరగాయలు, ఉద్యాన పంటలు

లంకల్లో లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తడంతో కూరగాయలు, ఉద్యాన పంటలు నీట మునిగాయి. పాదులు కొట్టుకుపోయాయి. సుమారు 584 ఎకరాల్లో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలంలోని లంక గ్రామాల్లోని 57 ఎకరాల్లో అరటి తోటలను వరద ముంచెత్తింది. తూర్పు గోదావరి జిల్లాలో ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ వరదలకు 55 వేల హెక్టార్లలో వరి పంట, 12 వేల ఎకరాల్లో నారుమడి నీట మునిగాయి. ప్రస్తుతం ఎర్రకాలువ ఉధృతి కొంత మేర తగ్గడంతో నిర్వాసితులు ఇళ్లకు వెళ్తున్నారు.



కోరుమిల్లిలో నిలిపేసిన మత్స్యకారుల బోట్లు



కేదార్లంకలో మిర్చి తోటల్లోకి చేరిన వరద నీరు




పి.గన్నవరం అక్విడెక్టు వద్ద ప్రవాహం

మళ్లీ మొండి చేయి

- పోలవరం నిర్వాసితుల ఊసెత్తని వైనం
- కోనసీమ రైల్వే లైన్‌కు కేటాయింపు నిల్
- పెట్రో కెమికల్ కాంప్లెక్ నిర్మాణంపై నీలినీడలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఈ సారి కూడా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు అన్యాయమే జరిగింది. కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న జిల్లా వాసుల ఆశలు ఆవిరయ్యాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం బడ్జెట్ కావడంతో విభజన సమయంలో జిల్లాకు ఇచ్చిన హామీలకు సంబంధించి నిధులు కేటాయిస్తారని ఆశించిన ప్రజలకు కేంద్రం మొండిచేయి చూపింది. పోలవరంకు సంపూర్ణ సాయం అందిస్తామని మాత్రమే చెప్పుకొచ్చారు. పోలవరం ఎడమ కాలువ, నిర్వాసితుల సమస్యలపై కనీస ప్రస్తావన లేదు.



పోలవరం నిర్వాసితుల ఊసేలేదు

పోలవరానికి సంపూర్ణ సాయం అందిస్తామని చెప్పిన కేంద్ర ఆర్థిక మంత్రి, పోలవరం నిర్వాసితులను మాత్రం పట్టించుకోలేదు. నిధులు ఎంత కేటాయిస్తారనే విషయమై స్పష్టత లేదు. ఈ ప్రాజెక్టును కాంటూరు లెక్కల ప్రకారం 41.5, 45.05, 47.02గా అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టుకోసం 1,67,765 ఎకరాల భూమి అవసరమని అధికారులు లెక్కతేల్చారు. దాదాపు రెండు దశాబ్దాల్లో 1,13,119 ఎకరాలు సేకరించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో 1.06 లక్షల కుటుంబాలను నిర్వాసిత జాబితాలోకి తెచ్చారు. ఇప్పటికి 11,677 మందికి మాత్రమే పునరవాసం కల్పించారు. ఈ గణాంకాల ప్రకారం కేవలం 11 శాతం మందికే పునరవాసం కల్పించినట్లు స్పష్టమవుతోంది. ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లించిన తర్వాతే నిర్మాణం చేపట్టాలని చట్టాలు చెబుతున్నాయి. ఈ నిబంధనలను పాలక ప్రభుత్వాలు గోదాట్లో కలిపేశాయి. జాతీయ ప్రాజెక్టు అయినప్పటికీ నిర్మాణ భాధ్యతలే తమదని బిజెపి ప్రభుత్వం మాట మార్చింది. ఆ ప్రభుత్వాన్ని నిలదీయటంలోనూ, ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నిధులు సాధించటంలో టిడిపి, వైసిపి ఘోరంగా విఫలమయ్యాయి. తాజాగా మరో సారి గోదావరి వదర పోటెత్తడంతో నిర్వాసితులు కొండలపై తాత్కాలిక పునరావాసంలో జీవిస్తున్నారు.

కోనసీమకు మళ్లీ నిరాశే...

కోనసీమకు రైలు కూత కల ఇప్పట్లో నెరవేరేలా కనిపించట్లేదు. కోటిపల్లి - నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కలగానే మిగిలిపోయేలా ఉంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో ఈ ప్రాజెక్టుపై కోనసీమ వాసులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కేంద్ర బడ్జెట్‌లో తప్పకుండా భారీగా నిధులు కేటాయింపు జరుగుతుందని ఆశించారు. కాని మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కోటిపల్లి నరసాపురం రైల్వే కోసం అసలు ప్రస్తావనే రాలేదు.

కానరాని పెట్రోకారిడార్

రూ.32 కోట్ల నిధులతో కాకినాడ పెట్రో కారిడార్ పేరుతో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తామని ఎన్నో ఏళ్లుగా కేంద్రం హామీ ఇస్తూ వస్తోంది. కాకినాడ, తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో సుమారు 14 వేల ఎకరాలు ఈ పరిశ్రమలకు కేటాయించాలని భావించారు. కేంద్రం నిధులు ఇస్తుందని ఎదురుచూస్తున్న జిల్లా ప్రజానీకానికి మరోసారి భంగపాటు కలిగింది. బడ్జెట్లో ఈ అంశం అసలు ప్రస్తావనకు రాలేదు. ఈ పెట్రో కారిడార్ ఏర్పాటైతే వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే వీలుంటుంది. ప్రధానంగా కాకినాడ జిల్లా యువతకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉంటుంది. కానీ బిజెపి ప్రభుత్వం మరోసారి ఈ ప్రాజెక్టుకు బడ్జెట్లో నిధుల కేటాయింపు ప్రస్తావనను తీసుకురాలేకపోయింది.

స్పష్టత ఇవ్వకపోతే ఎలా?

2013-14 ధరల లెక్కల్లో డిపిఆర్-2 ప్రకారం రూ.55 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. 2021-22కి పునరావాసానికి రూ.33 వేల కోట్లు అంచనా వేశారు. రూ.6 వేల కోట్లు మాత్రమే ఇప్పటి వరకూ ఖర్చు చేశారు. అయితే ఈ బడ్జెట్లో పునరావాసంకు ఎంత ఖర్చు చేస్తారు, ఎప్పటికి ఇస్తారు అనే దానిపై స్పష్టత లేకుండా మాట్లాడారు. వైసిపి హయాంలో కట్టిన డయాఫ్రమ్ వాల్ నిర్మాణం కూలిపోయిందని, దానికి రూ.2 వేలు కోట్లు ఖర్చు అవుతుందని కూటమి ప్రభుత్వం చెబుతోంది. కానీ బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో గాలిలో మాటలు తప్ప స్పష్టత లేదు. నిర్వాసితులకు పునరావాసం, డ్యామ్ కట్టేందుకు ఎంత నిధులు కేటా ఇస్తామనే దానిపై నిర్దిష్టత లేదు. ఇప్పటి వరకు రూ.10 వేలు కోట్లు కూడా కేంద్రం నుంచి రాలేదు.

- టి.అరుణ్, సిపిఎం జిల్లా కార్యదర్శి, తూర్పుగోదావరి

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి ఆశాజనకం

నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఆశాజనకంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రాజధాని అమరావతి నిర్మాణానికి బడ్జెట్లో రూ.15 వేల కోట్లు కేటాయించడంతో పాటు, ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు హామీ ఇవ్వడం హర్షించదగినది.

- తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్,కాకినాడ ఎంపీ

విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పాఠశాలల్లో విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం డిఇఒ కార్యాలయంలో ఎడిలు ఛాయాదేవి, వెంకట్రాజులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ మేరకు వినతి పత్రం అందించారు. జిఒ 117ను రద్దుచేయాలని, జిఒ 55 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఒకే పాఠశాలగా నడపాలన్నారు. రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానాన్ని అమలు చేయాలన్నారు. హై స్కూళ్లలో రెండు మీడియంలలో సమాంతరంగా బోధన నిర్వహించాలన్నారు. హై స్కూళ్లలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, మున్సిపల్ టీచర్ల పిఎఫ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్లస్ టు స్కూల్స్ ను ఏర్పాటు చేయాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్స్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని, ఎయిడెడ్ పాఠశాలలో ఖాళీలను భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎడిలు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు ఇవివిఎస్ఆర్ ప్రసాద్, కె.రమేష్, సిహెచ్.దయానిధి, రవిబాబు, కెవి.ప్రకాష్, విజయ్‌బాబు, ఐడికెడి.రాజేశ్వరి, చిలుకూరి శ్రీనివాస్, రవి వర్మ, గోపి అప్పారావు, జెవి సుబ్బారావు ఉన్నారు.

పలుచోట్ల కుంగిన ఏటిగట్టు

ప్రజాశక్తి - పెరవలి


మండలంలో గోదావరి పరివాహక గ్రామాలైన కడింపాడు, మల్లేశ్వరం, ఖండవల్లి, ముక్కామల, ఉమ్మడివారిపాలెం, కాకరపర్రు, తీపర్రు, ఉసులుమర్రు కానూరు అగ్రహారం, కానూరు, పెండ్యాల, పురుషోత్తపల్లి విజ్జేశ్వరం గ్రామాల మీదుగా నియోజవర్గంలో.30.2 కిలోమీటర్ల పొడవన గోదావరి ఏటిగట్టు ఉంది. మల్లేశ్వరం, ఖండవల్లి, తీపర్రు, పెండ్యాల ఇసుక ర్యాంప్‌ల నుంచి ఇసుక, లంక మట్టి, బొండు ఇసుకను భారీ లారీల గుండా ఏటిగట్లపై నుంచి తరలిస్తున్నారు. దీంతో ముక్కామల-కాకరపర్రు-తీపర్రు గ్రామాల మధ్యలో పలు ప్రాంతాల్లో ఏటిగట్టు కుంగింది. గుంతలు పడింది. గోదావరి వరద పెరగడంతో లంక పరివాహక గ్రామాల రైతులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో వచ్చిన వరదలకు మల్లేశ్వరం, ఖండవల్లి ప్రాంతాల్లో ఏటిగట్టుకు గండ్లు పడ్డాయి. అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం గోదావరి ఏటుగట్టు వెడల్పు, ఎత్తు పెంచారు. అప్పటి నుంచి ఏటిగట్లపై పర్యవేక్షణ కరువైంది.

వరదల సమయంలో తప్ప మిగిలిన వేళల్లో కనీసం ఏటిగట్టువైపు ఏ అధికారీ కన్నెత్తి చూడట్లేదని స్థానికులు చెబుతున్నారు. మరమ్మతులు కూడా నిర్వహించలేదని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వర్షాలకు కుంగిన చోట్ల పటిష్టతా చర్యలు చేపట్టాలని, గోతులను పూడ్చాలని రైతులు కోరుతున్నారు. గోదావరి ఉధతి పెరిగితే కుంగిన చోట్ల గండ్లు పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ చర్యలు చేపడతాం

భారీ వర్షాల వల్ల విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకు గల గోదావరి ఏటిగట్టు కొన్ని ప్రాంతాల్లో కుంగినట్టు సమాచారం వచ్చింది. పలుచోట్ల గుంతలు కూడా పడ్డాయి. కుంగిన ప్రాంతాల్ల రక్షణ చర్యలు చేపడతాం. ఇసుక బస్తాలు వేసి పూడుస్తాం. పెరుగుతున్న వరద కారణంగా ముందస్తుగా పలు ప్రాంతాల్లో ఇసుక బస్తాలు ఏర్పాటు చేశాం.

- జి.దుర్గాపవన్‌కుమార్, ఎఇ, సిద్ధాంతం



గట్టు కుంగడంతో ఏర్పడిన రంధ్రం

సమాజ సేవకు యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమాజ సేవకు యువత ముందుకు రావాలని స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. మంగళవారం జెఎన్ రోడ్‌లోని జిఎస్‌కెఎం లా కాలేజీలో జరిగిన లక్ష్మీశ్రీనివాస్ ట్రస్టును, రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడారు. ఎన్నో లక్షల మంది న్యాయ విద్యార్థుల అందించిన జిఎస్‌కెఎం న్యాయ కళాశాల నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్న ట్రస్టు రాజమండ్రి నగర ప్రజల అవసరాలు తీర్చడానికి కషి చేయాలని ఆకాంక్షించారు. యువకుడైన శరత్‌కృష్ణ తల్లిదండ్రుల పేరున ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేయాలనుకోవడం అభినందనీయమన్నారు. ట్రస్ట్‌కు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు పి.లక్ష్మీశ్రీనివాస్, ప్రధాన ఆధ్యాపకులు కె.మధుసూదన్‌రావు బోడా సౌందర్య, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబును ట్రస్ట్ తరపున సత్కరించి జ్ఞాపికను అందించారు.

ఆజాద్ స్ఫూర్తితో పోరాడాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం పోరాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా పిలుపునిచ్చారు. శ్యామల సెంటర్ వద్ద ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో చంద్రశేఖర్ ఆజాద్ 128వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్, రాజా మాట్లాడారు. ఆజాద్ జీవిత విశేషాలను వివరించారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న విద్యారంగ ప్రయివేటీకరణ విధానాలు, మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను వ్యాపారంగా మారుస్తున్న సందర్భంలో విద్యార్థులు కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చంద్రశేఖర్ ఆజాద్ లాంటి జాతీయ నాయకుల స్ఫూర్తితో పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కనక, జూనియర్ కాలేజీ కమిటీ సభ్యులు నాగ చైతన్య, కావ్య, భవ్యశ్రీ, నాగలక్ష్మి, మేఘన, హారిక, హేమంత్, కార్తిక్, మణికంఠ, ఆదిత్య, కిట్టు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

వరద ఉధతి దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెసి ఎన్.తేజ్‌భరత్ సూచించారు. మంగళవారం మద్దూరులంకలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను జెసి అధికారులతో కలిసి పరిశీలించారు. వరద ఉధతిపై తీసుకోవాల్సిన చర్యలు, గట్టు పటిష్టత కోసం చేపట్టిన చర్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు, వరదలు కారణంగా వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. మద్దూరు లంకలో వరద నీరు గ్రామంలోకి చొరబడకుండా ఇసుక బస్తాలతో గట్టును పటిష్ఠం కోసం తీసుకున్న విధానాన్ని పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, టూరిజం అధికారి స్వామి నాయుడు, తహశీల్దార్ కె.మస్తాన్ ఉన్నారు.

జనసైనికులకు అండగా జనసేన

ప్రజాశక్తి -దేవరపల్లి



జన సైనికులకు జనసేన పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. దేవరపల్లికి చెందిన జనసేన పార్టీ సభ్యుడు గతేడాది నవంబర్‌లో ప్రమాదవశాత్తు మతి చెందాడు. బాధిత కుటుంబానికి మంజూరైన రూ.5లక్షల చెక్కును మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాగబాబు చేతుల మీదుగా ఆదివారం అదించారని సువర్ణరాజు తెలిపారు. మృతిని కుటుంబానికి జనసైనికి సానుభూతిని తెలిపారన్నారు. అండగా ఉంటామని హామీఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కాటన్ గణేష్, ఉపాధ్యక్షులు చప్పటి శివనాగప్రసాద్, గ్రామ అధ్యక్షులు కంబాల సత్తిబాబు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

ముంపులో ఉన్న చేలు పరిశీలన

ప్రజాశక్తి - చాగల్లు


మండలంలోని మార్కొండపాడు, దారవరం, బ్రాహ్మణగూడెం పంచాయతీల్లో ముంపునకు గురైన పంటచేలు, ప్రాంతాలను ఎంపిడిఒ నాతి బుజ్జి మంగళవారం పరిశీలించారు. నిల్వ నీటిని బయటకు మళ్లించే చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి ఎం.వేణుగోపాల్, ఎపిఒ పి.అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని వీరలంకపల్లిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను మంగళవారం ఎంపిడిఒ గోవిందు సందర్శించారు. పాఠశాలలో సౌకర్యాలు, పారిశుధ్యం, విద్యా బోధనపై ప్రిన్సిపల్ మంజుల వేణిరాణిని అడిగి తెలుసుకున్నారు. ఆవరణలో పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉన్నాయని, విష సర్పాలు వచ్చే అవకాశం ఉండటంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. కోతులు, కుక్కలు బెడద ఉందని కోతులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, గోకవరం పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావు ఉన్నారు.

కార్టూ'నిజం'



బడ్జెట్‌లో విద్యారంగానికి నిరాశ

ప్రజాశక్తి - తాళ్లపూడి

కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి నిధులు కేటాయించకపోవడం నిరాశపరిచిందని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు, ప్రధాన కార్యదర్శి పి.సువర్ణరాజు అన్నారు. మంగళవారం తాళ్లపూడిలో వారు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ఆరు శాతం నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. కాని 3.25 శాతం నిధులు మాత్రమే కేటాయించారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు విద్యారంగానే నిర్వీర్యం చేసేలా ఉన్నాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల కోరుతున్న పాత పెన్షన్ పునరుద్ధరణ ఊసే లేకపోవడం దురదృష్టకరమన్నారు.

ఆధార్ నమోదు శిబిరాలు ప్రారంభం

ప్రజాశక్తి- కడియం

మండలంలో 11 సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభమయ్యాయని ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ తెలిపారు. 23 నుంచి 27 వరకూ ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. 23న కడియపులంక, వీరవరం, దుళ్ళ, 24న కడియపులంక, దుళ్ల, 25న వేమగిరి, జేగురుపాడు, దుళ్ల, 26న వేమగిరి, జేగురుపాడు, దామిరెడ్డిపల్లి, 27న కడియపులంక, దామిరెడ్డిపల్లి సచివాలయ పరిధిలో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. కొత్త ఆధార్ నమోదు, బయో మెట్రిక్ అప్‌డేట్ చేస్తారన్నారు.

పాఠశాలలను సందర్శించిన డిఎస్ఇఒ

గోకవరం : మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామంలో జడ్‌పి ఉన్నత పాఠశాల, ఎంపిపి పాఠశాల, తిరుమలాయపాలెంలో జడ్‌పి ఉన్నత పాఠశాలను డిఎస్ఇఒ కె.వాసుదేవరావు మంగళవారం సందర్శించారు. రంప ఎర్రంపాలెం హైస్కూల్‌లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను, రికార్డులను పరిశీలించారు. ఎండిఎం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. బోధనపై ఆరా తీశారు. సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు బి.గైరమ్మ, ఎం.చిమ్మరాజుదొర, హెచ్‌ఎంలు జి.ప్రమీలరాణి, ఎస్‌వి.సత్యనారాయణ, కె.లక్ష్మీకాంతం, జి.గణపతిరావు, ఎం.అప్పారావు, టి.త్రినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలవరానికి నిధుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి- గోకవరం

పోలవరం ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో రూ.15 వేల కోట్ల కేటాయింపుపై జడ్‌పిటిసి మాజీ సభ్యులు బోసు బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించడం హర్షణీయమన్నారు. జగ్గంపేటకు సమర్థవంతమైన నాయకుడు జ్యోతుల నెహ్రూ ప్రజలు ఎంఎల్‌ఎగా గెలిపించుకున్నారన్నారు.

విద్యుత్ ప్రమాదాలను అరికడదాం

ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ మూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యుత్తు భద్రతాప్రమాణాలు పాటిస్తూ ప్రమాదాలను నివారిద్దామని విద్యుత్ వినియోగదారులకు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ టివిఎస్ఎన్.మూర్తి పిలుపునిచ్చారు. భారీ వర్షాలు, గాలులు ఉన్నపుడు ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుపానుల సమయంలో స్విచ్‌లను ఆఫ్ మోడ్‌లో ఉంచాలన్నారు. తడిచేతులతో స్విచ్‌లు వేయరాదన్నారు. సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా ఎట్టిపరిస్థితుల్లోనూ తాకరాదన్నారు. వర్షం పడుతున్నపుడు విద్యుత్ స్తంబాలు, స్టే వైర్లను ముట్టరాదని తెలిపారు. ఇంటి పరిసరాల్లో చెట్లు, కరెంటు పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. గాలివాన సమయంలో కరెంటు లైన్ కింద ఉండరాదన్నారు. విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టర్) తెగి పడి వుంటే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1912 కి తెలియజేయాలన్నారు. మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వల్ల నీటిలో మునగడం, పూర్తిగా తడవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది కాబట్టి రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. భవన నిర్మాణాల సమయంలో నిర్మాణదారులు తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఐఎస్ఐ మార్కు కలిగిన స్విచ్‌లు, వైర్లను మాత్రమే ఉపయోగించాలన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమాజ భాగస్వామ్యంతోనే పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ సులభతరం అవుతుందని జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకర్ అన్నారు. స్థానిక నారాయణపురం మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. పునాది అభ్యసన కార్యక్రమంలో ఒకటో తరగతి నుంచి బాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలో సంఖ్యా శాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధి అమలు విషయంలో సమాజ భాగస్వామ్యంపై చర్చించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టిఎల్‌ఎంను పరిశీలించారు. విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏటిగట్టు పటిష్టతకు చర్యలు

ఉండ్రాజవరం : చేలల్లో నిలిచిపోయిన వరద నీరు తగ్గిన వెంటనే ఏటిగట్టు పటిష్టతకు తాత్కాలిక చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని కాల్దారి, పసలపూడి, సూర్యారావుపాలెం గ్రామాల్లో కొనసాగుతున్న వరద పరిస్థితిని ఆమె పరిశీలించారు. రైతులు, అధికారులతో మాట్లాడారు. తరచూ ఎర్ర కాలువ వరదల వల్ల పంట నష్టం జరుగుతుందని రైతులు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వర్షాకాలం ఇంకా పూర్తికాని కారణంగా ప్రస్తుతం ఏటిగట్టుకు ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఆమె వెంట ఆర్‌డిఒ, ఇతర అధికారులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

గల్లంతైన బాలుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - సీతానగరం

మిర్తిపాడు కాజ్‌వే వద్ద గల్లంతైన సీతానగరం మండలం ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన పిప్పళ్ల రాంబాబు(14) మృతదేహం మంగళవారం లభ్యమైంది. తండ్రి మందలించడంతో రాంబాబు సైకిల్‌పై బయటకు వెళ్లిపోయాడు. మిర్తిపాడు కాజ్‌వే వద్ద బాలుని సైకిల్‌ను గుర్తించారు. సోమవారం అతని ఆచూకీ లభించలేదు. మంగళవారం తెల్లవారుజాము నుంచి బాలుని కోసం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు గాలించాయి. రాంబాబు మృతదేహాన్ని కనుగొన్నారు. మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందర్నీ కలచివేసింది. బాలుడు చదువుతున్న తిరుమల స్కూల్‌తో పాటు ఉండేశ్వరపురంలో విషాదం నెలకొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి దిగువన స్కూల్ పిల్లలను ఎక్కించుకుంటున్న కాకినాడకు చెందిన ప్రయివేటు స్కూల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరి పీల్చు కున్నారు. పిల్లలను వేరొక బస్సులో తరలించారు. పెద్దాపురం నుంచి కాకినాడ వెళుతున్న స్కూల్ బస్సు పాత రిజిస్ట్రార్ కార్యాలయం సెంటర్‌లో ఆపి విద్యార్థులను ఎక్కించుకుంటుండగా తెలంగాణ రాష్ట్ర గజ్వేల్ నుంచి బియ్యం లోడుతో కాకినాడ పోర్టు కు వెళుతున్న లారీ ఆగివున్న స్కూల్ బస్సును వెనుకనుంచి ఢీ కొట్టింది. దీంతో బస్సు వెనుకన ఉన్న అద్దాలు పగిలి బస్సు పాక్షికంగా దెబ్బ తింది. ఆ సమయంలో బస్సులో 20 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీడిన మిస్సింగ్ కేసు మిస్టరీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం పోలీసు స్టేషన్‌లో బాలల మిస్సింగ్ కేసును ఛేదించినట్టు ఎస్‌ఐ జానీ బాషా తెలిపారు. కె.గంగవరం గ్రామానికి చెందిన పెద్దింశెట్టి సత్యనారాయణ పాఠశాలకు వెళ్లిన తన కుమార్తె వాగ్దేవి, కుమారుడు ప్రవీణ్ కనిపించడం లేదని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ కె.చిరంజీవి కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాంకేతిక పరిజ్ఞానంతో పిల్లల ఆచూకీ కనుగొన్నామని తెలిపారు. పిల్లలను వారి తల్లి దుర్గా భవాని మహాలక్ష్మి తనతో హైదరాబాద్ తీసుకెళ్లి పోయిందని, అక్కడ పని చేసుకుని పిల్లలను పోషించుకుంటుందని వివరించారు. వారిని ఇక్కడకు తీసుకువచ్చి పెద్దల సమక్షంలో అప్పగించారు.

గాయపరిచిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక వ్యక్తిని బీరు బాటిల్‌తో కొట్టి గాయపరిచిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి వాసు కుమార్ సోమవారం సాయంత్రం బ్యారేజ్ దగ్గర ఉండగా అదే గ్రామానికి చెందిన రమేష్, చంటి వాసుతో గొడవపడ్డారు. బీరు బాటిల్తో కొట్టి గాయపరిచారు. వెంటనే అతనిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎస్ శ్రీనివాస్ తెలిపారు

బెదిరించిన వారిపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

భార్యాభర్తలను బెదిరించి భయభ్రాంతులకు గురి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన నెల్లి హేమలత, ఆమె భర్త గంగబాబు చేపల వేట చేసుకుని జీవిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు సోమవారం హేమలతను భర్త గంగ బాబును, వారి కుటుంబ సభ్యులను దుర్భాషలాడి భయభ్రాంతులకు గురిచేసి బెదిరించారు. దీంతో హేమలత స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

మోటార్ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని వెదురుమూడి షిరిడి సాయి రైస్ మిల్లులో 8 విద్యుత్ మోటార్లు పంపులు, మండపేటలో 3 మోటార్ పంపులు చోరీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అంగర ఎస్‌ఐ పరదేశి తెలిపారు. మండపేట మండలం ఏడిదకు చెందిన బొచ్చ తరుణ్, గోకవరం మండలం ఎర్రంపాలెంకు చెందిన అలగిరి సత్యసాయి, చిట్టిగణేష్, ఏడిద గ్రామానికి చెందిన కాలే సుబ్రమణ్యంను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 11 ఎలక్ట్రిక్ మోటార్లు, పల్సర్ బైక్, మోటార్లు విప్పే పనిముట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను ఆలమూరు కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి కైకాలపేటకి చెందిన ఒక మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడు గెడ్డం సత్యనారాయణ మూర్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు నగరం ఎస్ ఐ పి.సురేష్ తెలిపారు వరుసకి మరిది అయ్యే నిందితుడు బాధితురాలిపై కన్నేసి వంట గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో అత్యాచార యత్నానికి పాల్పడ్డాడని ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో పరారైట్టు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలో వీరలంకపల్లిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వీరలంకపల్లికి చెందిన వల్లభశెట్టి రమేష్ గుమ్మళ్లదొడ్డి గ్రామంలో గల ఇథనాల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. వీరలంకపల్లి జంక్షన్ వద్దకు వచ్చేసరికి బుల్లెట్‌పై వస్తున్న వ్యక్తి వేగంగా వచ్చి రమేష్ బైకును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమేష్‌కి తీవ్ర గాయాలయ్యాయి. రమేష్ భార్య వల్లభశెట్టి దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సి



వరి పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

మునిగిన పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామంలో వర్షాలతో మునిగిపోయిన పంట పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి ఆధ్వర్యంలో సంబంధిత శాఖ అధికారులు శ్రీహరి, సంజీవ్ మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుతున్న కారణంగా వివిధ దశల్లో ఉన్న వరి పంట పై నీటిముంపు ప్రభావం లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పొలంలో నిలిచిపోయిన నీరు మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్ళేటట్లు బాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్, రైతులు లక్ష్మణదొర, తాతారావు, పద్మనాభ చౌదరి, నాగ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా తోట పవన్ పుట్టిన రోజు వేడుక

ప్రజాశక్తి - యానాం, తాళ్లరేవు



యానాంలో పవన్‌కు గజమాల వేస్తున్న అభిమానులు

ప్రముఖ వ్యాపారి తోట రాజు తనయుడు తోట పవన్ పుట్టినరోజు వేడుకలను అభిమానులు అత్యంత ఘనంగా నిర్వహించారు. మంగళవారం యానాం - ద్రాక్షారామ రోడ్డులోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్ వద్ద పవన్‌తో అభిమానులు భారీ కేక్ కట్ చేయించి బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్లోని డాక్టర్ బిఆర అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్కిల్ వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేశారు. అనంతరం చిన్న సెంటర్లోని, మార్కెట్ సెంటర్, జిఎంసి బాలయోగి స్టేడియం సెంటర్ వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన కేకులు కట్ చేస్తూ ర్యాలీ సాగింది. స్టేట్ బ్యాంక్ మీదుగా సుంకరపాలెం తోట రాజు షోరూమ్ వద్ద ఈ ర్యాలీ ముగిసింది. దారిపొడవునా అబిమానులు పూల వర్షం కురిపించారు. బారీ బాణాసంచా కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తోట రాజు షోరూం వద్ద 27 కేజీల కేకును పవన్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రరం, కాకినాడ, తాళ్లరేవు, ముమ్మిడివరం కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసి ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, వడ్డి ఏడుకొండలు, రాయుడు సునీత తదితరులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవులో తోట పవన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక హోండా షోరూంలో కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో యడ్ల కుటుంబరావు, బొంతు శ్రీనివాస్, దున్న ఎల్లారావు, మురళి, కె.మల్లేష్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

ఎంబిబిఎస్ తదితర వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నీట్‌లో అర్హత సాధించినవారంతా నిర్ణీత ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని పుదుచ్చేరి సెన్టాక్ కోఆర్డినేటర్ అమన్ శర్మ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎంసిసి ప్రవేశాలకు సంబంధిత సంస్థ నుంచి ఆదేశాలు రాగానే కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. యానాం ఏరియాకు సంబంధించిన అభ్యర్థులు స్థానికత, కుల, స్థానిక రిజర్వేషన్, తెలుగు మైనారిటీ తదితర అన్నిరకాల పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తాళ్ళరేవు



సమావేశంలో మాట్లాడుతున్న నిభావని

బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించిన కఠిన చర్యలు తప్పవని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిభావని హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని బాల్య వివాహాల వల్ల అనర్థాలు, వాటిని ప్రోత్సాహించే వారిపై చట్ట ప్రకారం చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువు పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి



మిడ్డే మీల్స్ పంపిణీని పరిశీలిస్తున్న డివైఇఒ

విద్యార్థుల చదువు పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని డివైఇఒ నాయుడు వెంకటేశ్వర అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పి.నాయకంపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు వివరాలను హెచ్ఎం ఎం.చిన్నరాజు ఆయనకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలలో మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన రీతిలో విద్యను అభ్యసించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ పర్యటనలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు ఫణికుమార్, వెంకటేశ్వరరావు, రామ్మూర్తి, అన్నపూర్ణ, ఉదయశ్రీ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై అసెంబ్లీలో బండారు గళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం, కొత్తపేట

అమరావతి అసెంబ్లీ సమావేశాలు జరుగుచున్న తరుణంలో కోనసీమలో రైతుల సమస్యలపై కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు మంగళవారం గళంమెత్తారు. ఆత్రేయపురం మండలం లొల్ల, ర్యాలీలో లాకులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయన్నారు. అవి ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. లాకుల పునర్నిర్మాణానికి సుమారు రూ.60 కోట్లు వ్యయం అవుతుందని తెలిపారు.

బాలాజీ దర్శనం వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి -మామిడికుదురు రూరల్

గోదావరి వరద ఉదతంగా పరగడంతో మంగళవారం అప్పనపల్లి వచ్చే ప్రధాన రహదారి నీటమునిగింది. రాకపోకలు సంభవించిపోయాయి వరద ఉదతి పెరుగుతున్నదున సుదూర ప్రాంతాల నుంచి బాల బాలాజీ స్వామి దర్శనం కోసం వచ్చేవారు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు.

త్వరలో స్వదేశానికి వీరేంద్ర కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

ఒక ఏజెంట్‌ను నమ్మి కతార్ దేశానికి పని కోసం వెళ్లి మోసపోయి సౌదీ అరేబియాలో ఒంటెల కాపరిగా పనిఅంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన సరెళ్ల వీరేంద్ర కుమార్‌ను సౌదీ అరేబియా నుంచి ఇండియాకు తీసుకురావడనికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. రీజినల్ పాస్పోర్ట్ ఆఫీసర్ ద్వారా సౌదీ అరేబియాలోని ఇండియన్ ఎంబసీ అధికారులతో వీరేంద్ర కుమార్‌ను ఇండియాకు తీసుకొచ్చే విషయమై కలెక్టర్ మాట్లాడారు. సౌదీ అరేబియా దామామ్‌లోని కింగ్ ఫహద్ విమానాశ్రయం నుంచి హైదరాబాదులోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వీరేంద్ర కుమార్‌ను తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

ఇంటింటికీ రక్షిత మంచినీరు

ప్రజాశక్తి - ఆలమూరు

ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించే దిశగా కృత నిత్యయంతో రక్షిత మంచినీటి సరఫరా శాఖ పని చేస్తుందని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ వి.విజయకుమార్ అన్నారు. మండలంలోని చెముడులంక శివారు గాంధీనగరం జాతీయ రహదారి ప్రక్కన 40 వేల లీటర్ల సామర్థ్యంతో రూ.37 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకును మంగళవారం జెఇ పి.పద్మ, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. గాంధీనగరంలో 400 మీటర్ల పైప్ లైన్, కుళాయిలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఏయే ప్రాంతాల్లో కుళాయిలు నిర్మించాలనే దానిపై ఆ ప్రాంత ప్రజల అభిప్రాయాలను సేకరణ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, దేవి, నేత అడబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అమలాపురం

పాఠశాలలు ప్రారంభమైన నేటికీ నెల రోజులు కావస్తున్నా అకడమిక్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం దారుణమని యుటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం యుటిఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు పెంకె వెంకటేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలైన జిఒ నెంబర్ 117 రద్దు, తెలుగు ఇంగ్లీష్ మీడియం రెండు ప్రభుత్వ పాఠశాలలో తీసుకురావాలన్నారు. మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులు అప్ గ్రేడ్ చేయాలని టీచర్ల బదిలీలు ప్రమోషన్లు వెంటనే నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉన్నత పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బంది నియమించాలని పాఠశాలకు గ్రాంట్లు మెయింటినెన్స్ గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు.



విద్యార్థికి నగదు అందజేస్తున్న కలెక్టర్, సంక్షేమ సంఘ సభ్యులు

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అమలాపురం

ఐఐటి ధన్‌బాద్ సీటు సాధించిన విద్యార్థినికి ఎపి షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సమకూర్చిన రూ.50 వేల నగదును కలెక్టర్ మహేష్ కుమార్ ద్వారా మంగళవారం విద్యార్థికి అందించారు. ఐఐటిలో సీటు సాధించి ఫీజు కట్టడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన బట్టు మంజులకు ఈ సాయం అందింఆచరు. విద్యార్థినికి కలెక్టకర్ శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్షేమ సంఘం చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల నకుల రాజు, ప్రధాన కార్యదర్శి గోసంగి బంగారాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఆర్గనైజర్ సెక్రటరీ గెడ్డం ప్రదీప్, మంగం సుధాకర్, అదనపు కార్యదర్శి బయ్య మోహనరావు, భూపతి మనోహర్ రాజు, బిఎస్ఆర్.ప్రసాద్, దార శ్రీకాంత్, ముత్తాబత్తుల శ్రీనివాసరావు, విప్పర్తి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏటిగట్టు రక్షణ చర్యల్లో కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కోటిపల్లి నుండి సుందరపల్లి మధ్య గోదావరి ఏటిగట్టు బలహీన ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు ఇసుక వేసి శ్రమదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కోట శ్రీనివాసరావు కాంగ్రెస్ నాయకులు దీనిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం గోదావరిలో ఇసుకను తరలించడానికి ప్రాధాన్యత ఇచింది తప్ప గోదావరి ఏటుగట్టను అభివద్ధి చేయలేదన్నారు. గోదావరి ఉధతంగా ప్రవహిస్తున్న కారణంతో కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రజలు బతుకుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి గోదావరి కరకట్టను పునర్నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.గంగవరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంగ ఉదయ్ కుమార్, సురేష్ పాలిక శివయ్య, నాగేశ్వరరావు, వాసంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇసుక మేటల తొలగింపు

ప్రజాశక్తి - అమలాపురం

అల్లవరం మండలం రామేశ్వరం మొగలో ఇసుక మేటలు తొలగించి ముంపు నీరు సముద్రంలోకి దిగేందుకు మార్గం సుగమం చేసినట్టు కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. ఏటా వేసవికాలంలో డ్రైన్‌లో నీరు లేకపోవడం, సముద్రపు అలల కారణంగా ఇసుక మేటలు వేసి రామేశ్వరం మొగ మూసుకుపోతుందన్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో అమలాపురం, అల్లవరం ఉప్పలగుప్తం, అయినవిల్లి మండలాలో సుమారు 30 వేల ఎకరాల్లో మొగ పూడిక వల్ల ముంపు నీరు కిందకి దిగక పంట పొలాల్లో నీరు చేరి నష్టం వాటిల్లుతోందన్నారు. ఈ మొగను తెరవడం ద్వారా డ్రైన్‌ల ద్వారా ముంపు నీరు సముద్రంలోకి దిగుతుందన్నారు.

ముంపు చేలను పరిశీలించిన నులుకుర్తి

ప్రజాశక్తి - కరప



మునిగిన పొలాలను పరిశీలిస్తున్న నులుకుర్తి

వర్షాలకు నీట మునిగిన పంటలను కాకినాడ రూరల్ నియోజకవర్గ టిడిపి ఎన్నికల కో-ఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు పరిశీలించారు. మంగళవారం మండల పరిధిలోని వాకాడ, యండమూరు, పెద్దాపుర ప్పాడులోని వి.సావారం ప్రాంతాల్లో ముంపు భారిన పడ్డా పొలాలను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 1225 ఎకరాలు ముంపుకు గురైనట్లు వ్యవసాయ అధికారులు ఒక అంచనాకు వచ్చారని ఆయన తెలిపారు. నీరు తగ్గిన తర్వాత పంట నష్టం అంచనాలు ప్రారంభించేందుకు చర్యలు చేపడతారన్నారు. రైతుల అధైర్య పడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దేవు వెంకటేశ్వరరావు, గండి వెంకటేశ్వరరావు, ఆచంట సూరిబాబు, సర్వశుద్ధి ఏడుకొండలు, మేడిశెట్టి విష్ణు, దమ్ము నూకరాజు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన ఎంఎల్ఎ తనయుడు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం తిమ్మాపురం గ్రామ పరిధిలో నీట మునిగిన పంటలను ఎంఎల్‌ఎ పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల దిగువ కాలువలను గుర్రపు డెక్క పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో నేడు ఆవ భూముల్లో సుమారు 360 ఎకరాలు పంట నీట మునిగిందని వివరించారు. దీంతో వెంటనే ఆయన అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడారు. తక్షణమే కాలువలో ఉన్న పూడికను తొలగించాలని, అందుకు అయ్యే ఖర్చును తాము భరిస్తానని చెప్పారు. కావున వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. దీంతో అధికారులు పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - కరప

పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురుపై కేసు నమోదు చేసినట్లు కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల మేరకు పెనుగుదురు గ్రామంలో రామలయం దగ్గరలో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారంతో దాడి చేసి ఆరుగురుని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి రూ.5050లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం రమణయ్యపేటలోని ఎపిఎస్‌పి స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్స్ కిట్స్‌ను ఇన్‌ఛార్జ్ ఎంపిపి బందిలి విరీషా పంపిణీ చేశారు. స్కూల్ ప్రిన్సిపల్ గాయత్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.